విశాలాంధ్ర
పార్వతీపురం మన్యం

విశాలాంధ్ర
అల్లూరి సీతారామరాజు
బుధవారం 5, మార్చి 2025



# రక్తదానం ప్రాణదానంతో సమానం: కలెక్టర్

విశాలాంధ్ర - బెలగాం: రక్తదానం ప్రాణ దానంతో సమానమైనదని జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. మంగళవారం లైన్ మేన్ దివాస్ పురస్కరించుని ఎపిఈపిడిసిఎల్ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద నిర్వహించిన నేను సైతం రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు రక్తదానం చేయడం వలన ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడవచ్చన్నారు. రక్త దానంకి మించిన దానం లేదని, ప్రతీ ఆరు మాసాలకు రక్తదానం చేయవచ్చని అపోహలు వీడి రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రోగులకు ప్రమాదకర సమయంలో రక్తం కోసం ఆశ్రయిస్తున్నారని రక్త నిల్వలు అందుబాటులో ఉంచేందుకు జిల్లాలో నాలుగు బ్లడ్ బ్యాంక్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని అందించేందుకు జిల్లాలో రక్త నిల్వలు పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. రక్తదాన శిబిరంలో దాతల నుంచి 89 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా. రాజ్ ప్రేమ్ తెలియజేశారు. అనంతరం రక్త దానం చేసిన దాతలకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎపిఈపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.చలపతి రావు, కార్యనిర్వహక ఇంజనీర్ కె. గోపాలరావు నాయుడు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బి.వాగ్దేవి, డిఎల్ఓ డా. ఎం.వినోద్ కుమార్, డిప్యూటీ ఈఈ సిహెచ్ వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నందాపురంలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - కొమరాడ: నందాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కురుపాం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అలజంగి నిర్మల జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందాలంటే రైతులంతా మీ రైతు సేవా కేంద్రాలలో రైతు విశిష్ట గుర్తింపు నెంబర్ ఖచ్చితంగా చేయించుకోవాలని, దీని ద్వారా రైతులకు వర్తించే అన్ని రాయితీలు పొందాలని చెప్పారు. రైతుల వద్ద ఖాళీగా భూమిలో నిమ్మగడ్డి సాగు చేసి అధిక ఆదాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అధికారి పి.శంకరరావు, సహాయకులు ఎం.మౌనిష పాల్గొన్నారు.

## ఘనంగా హెల్తీ ఉమెన్.. హ్యాపీ ఉమెన్

విశాలాంధ్ర - బలిజిపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మంగళవారం పార్వతీపురం కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు హెల్తీ ఉమెన్ హ్యాపీ ఉమెన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ధ్యానం వంటి కార్యక్రమాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సులేఖ, ఆశ వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర - గుమ్మ లక్ష్మీపురం: ప్రభుత్వ జూని యర్ కళాశాల, రెసిడెన్స్ స్కూల్ పీటీజీ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా అన్ని మౌలిక వసతులు కల్పించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పరీక్ష కేంద్రాలలో త్రాగునీరు ఏర్పాటు చేశారు. అవసరమైన మందులు ఓఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. పరీక్ష కేంద్రాల్లో పోలీసు బందువస్తు పకడ్బందీగా ఏర్పాటు చేశారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురంలో మహిళా దినోత్సవ వేడుకలను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి కె.విజయ గౌరీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని సామాజిక ఆర్థిక పరమైనటువంటి విషయాలలో ఇంకా మెరుగు పడాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ సిహెచ్ శంకరరావు, డాక్టర్ శృతి, అంగన్వాడి సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు, ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## శంబర పోలమాంబ ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ 6వ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచి చదురు గుడి మరియు వనము గుడి వద్ద క్యు లైన్‌లో నిలుచొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు సౌకర్యం లడ్డు ప్రసాదాలను అందుబాటులో ఉంచారు. భక్తులు అమ్మవారి వేప చెట్టు వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ, ఘటనలు జరగకుండా సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## భూ యజమానుల సమక్షంలో రీ సర్వే

విశాలాంధ్ర - గరుగుబిల్లి/ పార్వతీ పురం: భూ యజమానుల సమక్షంలో రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గరుగుబిల్లి మండలంలోని పైలెట్ గ్రామంగా దళాయవలసలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రీ సర్వేలో గ్రామ భూ విస్తీర్ణం, ఇప్పటి వరకు పూర్తి చేసిన సర్వే, ఇంకా చేపట్టనున్న సర్వే వివరాలను తహశీల్దార్ పి.బాలను అడిగి తెలుసుకున్నారు. భూమి కొలతలు వేసేముందు రైతులకు ఫాం -19 నోటీసులు ఇస్తున్నది, లేనిది, అడంగల్‌లోని రైతుల పేరు మీద ఉన్న భూమి విస్తీర్ణం కచ్చితంగా కొలతలు వేస్తున్నారా, లేదా అనే విషయాలపై ఆరా తీశారు. భూ యజమానులకు నోటీసులు జారీ చేసి వారి సమక్షంలోనే కొలతలు వేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో 676 ఎకరాల్లో సర్వే పూర్తికావాల్సి ఉండగా, 573 ఎకరాలు సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈటీఆర్డీ గోపాల్‌రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, విఆర్ఓ వి.శ్రీనివాస్, సర్వే బృందం, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ఎంపీడీఓ పరిశీలన

విశాలాంధ్ర -సీతంపేట: టిటుకుపాయి సచివాలయం పరిధిలోని హౌస్ హెల్డ్ వివరాలలో, మరణించిన వ్యక్తులు యొక్క వున పరిశీలనకై కుసుమూరు, టిటుకు పాయిగూడ, టిటుకుపాయి గ్రామాలను ఎంపీడీవో గీతాంజలి మంగళవారం సందర్శించడం జరిగింది. అనంతరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో జరుగుతున్న రోడు, ప్రహరీ పనులను పరిశీలించారు. త్వరితగతిన వర్క్ ఫ్రం హెూం సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటి నుంచి పనిచేస్తున్న వారు మరియు ఇంటి నుంచి పనిచేయటానికి ఆసక్తి ఉన్నవారు, 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్న గ్రామస్తులను తప్పనిసరిగా ఈ సర్వేలో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.రాజశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాము, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అరవింద్, మహిళా పోలీస్ విజయశాంతి, డిజిటల్ అసిస్టెంట్ అమల, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో మార్కొండ పుట్టి పరిధిలో పెద గైశీల గ్రామంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును మంగళవారం ఎంపీడీవో డిడి స్వరూప రాణి, మండల ఇంజినీరింగ్ అధికారి బి.రజిత్ పరిశీలించారు. తలగడవలస గ్రామంలో ఉపాధి నిధులతో జరుగుతున్న ఇంకుడు గుంతలు నిర్మాణం, తలగడ వలస గ్రామం వద్ద వనుకు బందపై కొబ్బరి మొక్కల ప్లాంటేషన్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు ఎం.శ్రీనివాసరావు, క్షేత్ర సహాయకులు అప్పారావు పాల్గొన్నారు.

## ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి

వ్యవసాయాధికారి తిరుపతిరావు

విశాలాంధ్ర - పాచిపెంట: మెట్టు పంటలు వేసే రైతులు వర్షపు నీటిని నిల్వ చేసుకొని ఒకటి రెండు తడులు ఇవ్వడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారి కే.తిరుపతిరావు అన్నారు. కూనం బందవలస గ్రామంలో రైతుల పొలం పిలుస్తోంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువగా పత్తి పంట పండిస్తున్నారని ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా నీటిని నిలువ చేయవచ్చని తెలిపారు. అలాగే వేసవిలో వాలుకి అడ్డంగా దున్నడం వలన, వాలుకి పైన కందకం తవ్వడం ద్వారా కూడా నీటిని భూమిలో నిల్వ చేసుకోవచ్చని అన్నారు. పంచాయతీ చెరువులలో చేపలు పెంచుకోవడం వరి పంటతోపాటుగా చేపల పెంపకం చేపట్టడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అశ్విని, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

## 80 లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి లోని పూతిక వలస గ్రామ పరిసరాలలో అక్రమంగా నాటుసారా అమ్మకాలు జరుపుతున్న నాగో అవినాష్ నుంచి 80 లీటర్ల నాటుసారా, ఒక బైక్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ రాజశేఖర్, సిబ్బందితో మాటువేసి నిందితుడ్ని పట్టుకుని అరెస్టు చేశామని తెలిపారు.

# చెరువుల ఆక్రమణలపై కమిటీ వేయాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పార్వతీపురం/ పార్వతీపురం టౌన్: నియోజక వర్గంలో ల్యాండ్, చెరువు ఆక్రమణల నిగ్గు తేల్చేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విజయ్ చంద్ర మంగళవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసు కుందని ఆ సదస్సులను ఎప్పటికి అమలు చేస్తారని ప్రశ్నించారు. అనంతరం నియోజకవర్గంలో సమగ్రమైన భూముల వివరాలు లేవని రెవెన్యూ శాఖ ఆర్డీవో కలెక్టర్ వద్ద కూడా లేవని ఎమ్మెల్యే ప్రస్తావించారు. సరైన రికార్డు లేనందున 2019 నుంచి గత వైసీపీ పాలనలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. పార్వతీ పురం పట్టణం పరిసర ప్రాంతాల్లో 70 వరకు చెరువులు ఉండేవని అవి ప్రస్తుతం 14 అయిపోయాయని వివరించారు. చెరువులు కప్పేసి రియల్ ఎస్టేట్‌లకు ఇచ్చి దందాలు నడిపారని అందుకు గత ఎమ్మెల్యే ప్రధాన కారకులని ఎమ్మెల్యే అన్నారు. చెరువు కప్పేయడం రియల్ ఎస్టేట్‌కి ఇవ్వడం, ఏవో తప్పులు చూపించి రిజిస్ట్రేషన్ చేయడం తదితర దందాలు నడిచాయని ఈ కారణంగా పేదలే తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో జరిగిన అక్రమాలు నిగ్గు తేల్చేందుకు పేదలకు న్యాయం జరిగేలా చేసేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని స్పీకర్‌ని ఎమ్మెల్యే కోరారు.

# ఎన్‌హెచ్-516 గుత్తేదారుడి నిర్లక్ష్యం

- ఆసుపత్రి పాలవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

విశాలాంధ్ర - పాడేరు: రాజమండ్రి నుండి విజయనగరం వరకు ఎన్‌హెచ్ 516 హైవే రోడ్డు నిర్మాణం ప్రస్తుతం ముమ్మారంగా జరుగుతుంది. అయితే అభివృద్ధిని కోరుతూ ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.జి.మాడుగుల నుండి పాడేరు వరకు జరుగుతున్న హైవే రోడ్డు నిర్మాణం గుత్తేదారుడు నిర్లక్ష్యంతో ఇందుకు పూర్తిగా భిన్నంగా వ్యవరిస్తున్నాడు. రోడ్ల నిర్మాణం చేపట్టేటప్పుడు ఒకవైపు రోడ్డు పూర్తిగా నిర్మాణం చేస్తూ మరోవైపు వాహనాలకు రోడ్డు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ మొత్తం రోడ్ అంతా ఒకేసారి నిర్మాణం చేపడతామన్నట్లు రోడ్డు మొత్తం తవ్వడం వల్ల అటుగా వస్తున్న వాహనాల వల్ల దుమ్ము, ధూళి పైకి ఎగసిపడుతూ రావటం అటుగా వెళుతున్న ద్విచక్ర వాహనదారులు దుమ్ము ధూళి పీల్చుకొని అనేక రోగాల పాలవుతూ కొన్నిచోట్ల ప్రమాదాలు జరిగి కాలు చేతులు విరగడంతో పాటు ప్రాణాలే కోల్పోతున్న సంఘటనలు లేకపోలేదు. ఈ నిర్మాణం చేపడుతున్న గుత్తేదారుడు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం ఏమిటని పలు ప్రజా సంఘాల నాయకులు, గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణంలో భాగంగా మలుపుల వద్ద ప్రమాదాపు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు వెయ్యకపో వడంతో రాత్రి సమయంలో అనేక చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే రోడ్డు నిర్మాణం చేసేటప్పుడు దుమ్ము, ధూళి ఎగరకుండా వాటర్ ట్యాంకర్‌లతో వాటరింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు వేయడంతో దుమ్ము ధూళి పీల్చి ఊపిరితిత్తులకు చేరి ఇన్ఫెక్షన్‌కు గురవుతున్నారు. మరో విశేషం ఏమిటంటే ద్విచక్ర వాహనాల ద్వారా వచ్చే వ్యక్తులు పాడేరు చేరుకునేసరికి అనారోగ్యం పాలై ఆసుపత్రులలో చేరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విలేకరుల అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సిహెచ్‌వి రమణ ద్విచక్ర వాహనంలో చింతపల్లి నుండి పాడేరు వచ్చే సమయానికి జిమాడుగుల నుండి మొదలుకొని పాడేరు వరకు ఎగురుతున్న దుమ్ము ధూళి పీల్చుకొని ఆసుపత్రి పాలైన సంఘటనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దుమ్ము ధూళి ఎగరకుండా ఒకవైపు వాహన రాకపోకలకు ఖాళీ స్థలం వదులుతూ నిర్మాణాలు చేపడతారో లేక గాలికి వదిలేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతారో వేచి చూద్దాం మరి.

## 22 నుండి బాలారం బంగారు తల్లి ఉత్సవాలు

విశాలాంధ్ర - కొయ్యూరు: ప్రతి ఏటా అత్యంత వైభవంగా, ఆహ్లాదకరంగా నిర్వహించే బాలారం బంగారు తల్లి జాతర మహోత్సవాలను ఈ నెల 22 నుండి 27 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అప్పన ఆనంద్ కుమార్, గాదిరాజు లక్ష్మీ రాజ్, బంటు నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలారం మాజీ సర్పంచ్ దివంగత అప్పన శ్రీరాములు జ్ఞాపకార్థం ఈ నెల 9 నుండి అల్లూరి సీతారామరాజు ప్రీమియర్ లీగ్ పేరుతో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి 20,000, రెండో బహుమతి 10000 ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 23న కొయ్యూరు మండలంలోని మొదటిసారిగా ఎడ్ల బండ్లు పోటీలు, 25న ట్రాక్టర్ రివర్స్ పోటీలను 26, 27 తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. వివరాలకు 9390 219346, 9441243122ను సంప్రదించాలన్నారు.

## పాత బస్టాండ్‌లో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - పాడేరు: పాడేరు పాత బస్టాండులో కంపు బాబోయ్ కంపు అనే కథనంతో విశాలాంధ్రలో వెలువడిన వార్తకు పంచాయతీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాత బస్టాండ్ మురుగు డ్రైనేజీలలో ఉన్న టీ కప్పులు, ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు. అలాగే పట్టణంలో వివిధ చోట్ల పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. దీంతో పట్టణ ప్రజలంతా హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయితీ ఈవో రమేష్ మాట్లాడుతూ పట్టణంలో ఒకవైపు శుభ్రం చేసుకొని వస్తే మరోవైపు పట్టణవాసులు చెత్తను రోడ్లపై, డ్రైనేజీ కాలువలపై వ్యర్థాలను వేయడంతో వ్యర్థాలు కూరుకు పోతున్నాయని, పట్టణలో డస్ట్ బిన్స్ ఇచ్చిన ప్పటికీ పట్టణ ప్రజలు దాన్ని ఉపయో గించకపోవడం చాలా బాధాకరమని, ఇప్పటికైనా పట్టణ ప్రజలంతా పంచాయతీ అధికారులు పెట్టిన డస్ట్ బిన్స్‌లో వ్యర్థాలను వేసి పంచాయతీ అధికారులకు సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

## మహిళా దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర - జీకే వీధి: మిషన్ శక్తి కింద అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారోత్సవాలలో భాగంగా ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ జీకేవీధి పరిధిలో సి.డి.పి.ఓ ఏ.లక్ష్మీ దేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పుజారిపాకలు అంగన్వాడీ కేంద్రంనందు గర్భవతులకు, బాలింతలకు, పౌష్టికాహారం, చిరు ధాన్యాలపై అవగాహన కల్పించడంతోపాటు యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలు తెలిపి యోగా ఆసనాలు వేయంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కే.రామ లక్ష్మీ, డి.మోహినీ, డి.వలసమ్మ, డి.కృష్ణ కుమారి, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమమే సీఆర్‌పీఎఫ్ లక్ష్యం

సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినీత

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రజా రక్షణతో పాటు, ప్రాంతాల పరిరక్షణ, నిరుపేదల సంక్షేమం, సంరక్షణకు కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ నిరంతరం పనిచేస్తుందని కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ డి.వినీత అన్నారు. మంగళ వారం తన సిబ్బందితో కలిసి మండలం లోని వివిధ గ్రామాలలో ఆమె కలియ తిరిగారు. మన్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ నిరంతరం పనిచేస్తుందన్నారు. సివిల్ పోలీసులతో సమన్వయం చేసుకొని తమ బృందం సభ్యులతో అనుమానిత ప్రదేశాలలో అణువణువు క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. గిరి గ్రామాల్లోనూ గంజాయి సాగు, రవాణాల నియంత్రణ లోనూ, పల్లెల్లోని నిరుపేద ప్రజలలో మార్పు కోసం, గిరి గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సిఆర్పిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ పోలీస్ బృందం పాల్గొన్నారు.

## వరుస ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా...!

విశాలాంధ్ర - జి.మడుగుల: లమ్మసింగి నుండి వయా జి.మాడుగుల, పాడేరు మీదుగా ఎన్‌హెచ్ 516 హైవే రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డు పక్కన ఉన్న గ్రామాల్లో దుమ్ము ధూళి పొగతో కూడుకుని ప్రజలు అనారోగ్యానికి గురై మరణాల పాలవుతున్నారని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఒకవైపు అధిక దుమ్ము లేవడం వల్ల వాహనదారులు రోడ్డు కనిపించక నిత్యం చాలా ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ విషయమై అధికారులకు, సంబంధిత కాంట్రాక్టర్లకు తెలివినా ఫలితం లేదన్నారు. ఎటువంటి ఆటంకాలు కలగకుండా కనీసం రోడ్లకు నీళ్ల తడిపితే దుమ్ము ఎగరకుండా ఉండే చర్యలు తీసుకొన్నట్లైతే ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉంటాయని అలాగే రోడ్డు పనులు వేగంగా చెయ్యాలని అధికారులకు తెలిపారు. ఈ చర్యలు తీసుకోకపోతే స్థానిక ప్రజలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

## హనుమంతరావుకు ఐఐఎంఆర్ మిల్లెట్స్ కిసాన్ ప్రశంసాపత్రం

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఈ నెల 3, 4 తేదిలో హైదరాబాద్ ఐఐఎంఆర్ మిల్లెట్స్ కిసాన్ మేళలో జిల్లాకు చెందిన జి.మాడుగుల మండలం మత్స్యదేవత ఎఫ్పీవోకు బెస్ట్ అవార్డు దక్కినట్లు ఎఫ్పీవో సీఈవో హనుమంతరావు, శేఖర్ తెలిపారు. ఈ మేళకు ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రల నుంచి పాల్గొనడం జరిగిందని తమ ఎఫ్పీవోకు బెస్ట్ రావడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని శాస్త్రీయ సాగు, చిరు ధాన్యాల ఉత్పత్తులు చేపడతామని ఆయన చెప్పారు.

# పెదవలసలో యదేచ్ఛగా అక్రమ కట్టడాలు

చోద్యం చూస్తున్న పంచాయతీ సిబ్బంది

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని పెద వలస పంచాయతీ పెదవలస ప్రధాన కేంద్రంలో విచ్చలవిడిగా కొంతమంది వ్యక్తులు కొత్తగా గృహాలు, షాపులు నిర్మించుకుంటు న్నారు. వీరికి కొత్తగా షాపులు, గృహాలు నిర్మించుకోవడానికి ఎవరు అనుమతి ఇచ్చారనేది గ్రామస్తులకు పీసా కమిటీ సిబ్బందికి తెలియ జేయాలని సచివాలయ సిబ్బందికి విన్నవించినా చలించలేదని పీసా కమిటీ ఉపాధ్యక్షులు కంకిపాటి గిరిబాబు, కొర్ర బాలయ్య తెలిపారు. అనుమతులు ఉన్నాయా లేదా అనేది తేలకుండానే గిరిజనేతరులు షాపులు నిర్మించుకుంటున్నారని తక్షణమే మండల అధికారులు పెదవలస గ్రామ పంచాయతీ పెద్దల సమక్షంలో తేల్చాలని అన్నారు. గిరిజనేతర్లు గృహాలు, షాపులు నిర్మించుకోవడం పెదవలస గ్రామ గిరిజనులు భారీ ఎత్తున నష్టపోతున్నారని వారికి న్యాయం చేకూర్చి రోడ్డుకి ఇరువైపులా ఉన్నటువంటి షాపులకు హైవే ఎన్‌హెచ్ 516 వాళ్ళు నష్ట పోయిన వారికి నష్టపరిహారం కూడా ఇచ్చార న్నారు. ఆ నష్టంలో మన గ్రామానికి సంబంధించి గ్రంథాలయం కూడా పోయిందన్నారు. ఇప్పుడు ఆ గ్రంథాలయాన్ని పాత గ్రంథాలయం ఉన్నటువంటి వెనకాల ఖాళీ స్థలంలో కొత్తగా గ్రంథాలయం నిర్మించ కోనుటకు గ్రామ పెద్దలు నిర్ణయించుకున్నా రన్నారు. ఆ స్థలంలో గిరిజనేతరులు షాపులు గృహాలు నిర్మించు కుంటు న్నారు. పంచాయతీలో ఉన్నటువంటి సచివాలయ రెవెన్యూ సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ఈ విషయమై స్పందించి న్యాయం చేయాలి వారు కోరుతున్నారు.

## గాదె గెలుపుపై పీఆర్టీయూ హర్షం

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసుల నాయుడు గెలుపును హర్షిస్తూ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిబద్ధతతో కృషి చేస్తున్న గాదెకు పట్టం కట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గెన్ను, నాయకులు ధర్మ, చిన్ని, రాంప్రసాద్, మధుసుదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార గ్రామీణ నీటిపారుదల సంస్థ ఎ.ఎస్.ఆర్ విభాగము, కార్యనిర్వాహక ఇంజనీరు వారి కార్యాలయము.

షార్టు టెండరు ప్రకటన

Tender Notice No., 01/EE/RIC/ASR/2024-25. తేది: 04.03.2025

ఎ.ఎస్. ఆర్ జిల్లా యందు 152.90 లక్షలు అంచనా విలువగల వివిద గ్రాంట్ క్రింద మంజూరు అయిన 06 పనులకు సీలు వేసిన టెండర్‌లు కోరబడుతున్నవి.

టెండర్ షెడ్యూలు దరఖాస్తు చివరి తేది: 07.03.2025
టెండర్ స్వీకరణకు చివరి తేది: 12.03.2025 మ. 3.30గ. వరకు

మిగతా వివరములకు కార్యాలయ పనివేళయందు సంప్రదించవలసినదిగా కోరదమైనది

కార్యనిర్వాహక ఇంజనీర్

## ప్రభుత్వ పథకాలపై దివ్యాంగులకు అవగాహన

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండల కేంద్రంలోని రేఖపల్లి ఏఎస్‌డిఎస్, శబరి వికలాంగుల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల గురించి దివ్యాంగులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ చల్లారి సాయి చైతన్య మాట్లాడుతూ ప్రతి దివ్యాంగుడు యుడిఐడి కార్డు పొందాలని ముందు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలపై దరఖాస్తు చేయుటకు సదరం సర్టిఫికేట్‌తో పాటు యూనిక్ డిజబుల్డ్ ఐడి తప్పనిసరిగా ఉండాలన్నారు. అదేవిధంగా బ్యాటరీ సైకిల్ స్కూటీ కొరకు దరఖాస్తు పెట్టుకోవచ్చని తెలిపారు.

కార్యక్రమంలో దివ్యాంగులు కో ఆర్డినేటర్ నేరుపటి రవి, ఏఎస్‌డిఎస్ సిబ్బంది, ఉండవల్లి హరిబాబు, గొర్రె ముత్యాలరావు, రాజారావు, పూజిత, సౌజన్య, ప్రసాద్, మీనా, పులి శివశంకర్ పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ కమిటీ అల్లూరి జిల్లా లీగల్ అడ్వైజర్‌గా నూకరాజు

విశాలాంధ్ర - కొయ్యూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ అల్లూరి జిల్లా లీగల్ అడ్వైజర్‌గా నడిగేట్ల నూకరాజు నియమితులయ్యారు. బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కోకన్వీనర్ కాంగు శుభ(చిన్ని) ఆశీస్సులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ వారు తనను ఎంపిక చేసి ఈ అవకాశం కల్పించారన్నారు. బాలల పట్ల, బాలల సమస్య పట్ల, బాలల హక్కుల పట్ల, బాలల జీవన విధానం పట్ల, బాలల ఆరోగ్యం పట్ల పనిచేయుటకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ వారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు తెలిపారు.

## జీవవైవిధ్యం, పరిరక్షణపై సెమినార్

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో "జీవవైవిధ్యం, పరిరక్షణ" అనే అంశంపై నేషనల్ వెబినార్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మహబూబ్ నగర్ జిల్లా, జడ్చర్ల ప్రభుత్వ కళాశాల వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్. బి.సదాశివయ్య జీవవైవిధ్యం-పరిరక్షణ గురించి అవగాహన కల్పిస్తూ ప్రకృతిని, పర్యావరణాన్ని అనుసంధానిస్తూ ఔషధ మొక్కలైన ఉసిరి, మర్రి మొదలైన వాటి రసాయనిక ఉపయోగాలను వివరించారు. అంతరించిపోతున్న జంతు, వృక్ష జాతులను ఏవిధంగా పరిరక్షించాలి, ప్రకృతిలో వాటియొక్క ఆవశ్యకత గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు జి.వెంకటరావు, డాక్టర్.వై.పద్మ, కె.శకుంతల, జి. సాయికుమార్, యస్.అప్పనమ్మ, యం.నాగమోహనరావు, జి.హారతి, కె.శైలజ, కె.శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, రాజబాబు, నూనె రమేష్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - గంగవరం: ఈ ఏడాది నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఉపాధి హామీ పనులను సక్రమంగా త్వరితగతిన పూర్తి చేయాలని ఏఎస్ఆర్ జిల్లా డూమా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డివి.విద్యాసాగర్ సూచించారు. గంగవరం మండలం గంగవరం రైతు కుంజం లక్ష్మి రైతు పొలంలో ఉపాధి హామీ నిధులు రూ.63626తో నిర్మించిన ఫారం ఫండ్ పనులను, రైతు మడకం సోమలమ్మ పొలంలో ఉపాధి హామీ నిధులు 62761 రూపాయలతో నిర్మించిన ఎస్ ఎం సి కందకాలను ఆయన పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 100 రోజులపాటు పనులు కల్పించాలని ఏపీఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ ప్రకాష్, ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నాలు దొర పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పాల్గొనలేదు...?

### టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్

విశాలాంధ్ర - కురుపాం: ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఎందుకు పాల్గొనలేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ ప్రశ్నించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి కూటమి ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత ఉందంటూ చేసిన విమర్శలపై స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ట్వీట్ చేస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజనకర పరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉంటే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఏవిధంగా గెలిచారని ప్రశ్నించారు. కూటమిపై వ్యతిరేకత ఉండీ వైసీపీకి ఆదరణ ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఎందుకు పాల్గొనలేదని ఎద్దేవా చేశారు. మాజీ ఉపముఖ్య మంత్రి పాముల పుష్పశ్రీవాణి తన ఆలోచన మార్చుకోవాలని అన్నారు.

## పది విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యూరు: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని రిషి విద్యాసంస్థల డైరెక్టర్ మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలో చిట్టింపాడు, డౌనూరు బాలురు ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నర్సీపట్నం రిషి విద్యాసంస్థలు రిషి అగ్రి కల్చర్ పాలిటెక్నికల్, రిషి ఇంటర్, రిషి డిగ్రీ ల నుండి స్టేషనరీని అందజేశారు ఈ సందర్భంగా రిషి విద్యాసంస్థల డైరెక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అందరికీ రిషి విద్యాసంస్థల నుండి స్టేషనరీ అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మండలంలో 10వ తరగతి పరీక్షల్లో టాపర్ గా లిచిన విద్యార్థి కి తమ విద్యాసంస్థల్లో 50 శాతం రాయితీ కల్పిస్తామన్నారు అలాగే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కూడా ఫీజులో రాయితీ కల్పిస్తామని తెలిపారు. కావున విద్యార్థులందరూ పట్టుదలతో చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో రిషి విద్యాసంస్థల ఏవో.శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షులుగా నలజాల శ్యామ్

విశాలాంధ్ర - ఎటపాక: బీజేపీ మండల అధ్యక్షులుగా నలజాల శ్యామ్ ఎన్నికయ్యారు. మంగళవారం బిజెపి కార్యవర్గ బిజెపి యువ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూడే సతీష్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు పేరాల రాజు, గుండుపూడి రమేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ములకలపల్లి రామకృష్ణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చింతా దుర్గారావు, సరియం శ్రీను, బుయ్యన సాయి, నలజాల శ్యామ్ ప్రసాద్ పేరును ప్రతిపాదించగా 21 బూత్ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎటపాక మండల అధ్యక్షులుగా నలజాల శ్యాం ప్రసాద్‌ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కత్తి, సత్యం, బూత్ అధ్యక్షులు పి.ప్రసాద్, సురేంద్ర, కే.అంజిబాబు, టి.రాజశేఖర్, డి.ముత్యాలరావు, కే.కళ్యాణ్, పి.రమేష్, ఎం.విష్ణు, సోడే.శేఖర్, మడకం వెంకటేష్, తుర్రం విజయ్, బి.వంశీ, కాకసాగర్, కణితి కళ్యాణ్, జి.నాగేంద్ర, పి.దినేష్, రమేష్, నాగరాజు, శేఖర్, గద్దల.నవీన్, నాంపల్లి రమేష్, తుర్రం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల కోసం మన్యంలో భవిత పాఠశాలలు

### ఐటీడీఏ పీఓ సింహాచలం

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీ ఏడు మండలాల్లోని భవిత పాఠశాలలు అభివృద్ధి చేయుటకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో మండల కేంద్రాలలో ఉన్నటువంటి భవిత పాఠశాలలు అభివృద్ధి చేయుటకు ఏజెన్సీ డీఈవోతో, ఐసిడిఎస్ సిడిపిఓతో, అన్ని మండలాలకు సంబంధించిన భవిత పాఠశాలల ఉపాధ్యాయులతో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని మండలాల పరిధిలో గల అంగన్వాడి కేంద్రాలలో, వివిధ పాఠశాలలలో మానసిక వికలాంగులను గుర్తించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అందత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, భాషణం లోపం, మస్తిష్క మెదడు పక్షవాతం, నిర్దిష్ట అభ్యాసన వైకల్యం, మానసిక వైకల్యం బుద్ధి మంద్యత, చలన వైకల్యం/శారీరక వైకల్యం, మరుగుజ్జుతనం, కుష్టు వ్యాధి నయాగ్రస్తులు, బహుళ వైకల్యం, అటిజం, దీర్ఘకాలిక నరాల సమస్య, కండరాలు క్షీణిత, బహుళనాడి వ్యవస్థలో బలహీనత, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, దళ సేమియా, రక్తం గడ్డ కట్టని స్థితి, కొడవలి కరణ రక్తహీనత, మెదడు నుండి నరాల బలహీనత మొత్తం 21 వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రతి గ్రామంలో సర్వే చేసి నివేదికల సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, సిడిపిఓ సంధ్యారాణి, యస్ఏ. అర్చన రమణి అన్ని మండలాలకు సంబంధించిన భవిత పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో సమానమే...

విశాలాంధ్ర - చింతపల్లి: విద్యార్థులు వ్యాసరచన పోటీల ద్వారా ప్రతిభను పెంపొందించుకోవాలని చింతపల్లి ఎస్సై లు వెంకటేశ్వరరావు, వెంకటరమణ లు అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలోనూ పితృస్వామ్య నిబంధనలను సవాలు చేయడంలో పురుషుల అవసరము" అనే అంశము పై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆ కళాశాల ప్రదానాచార్యురాలు డాక్టర్ ఎం.విజయభారతి సమక్షంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలను కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ కెజియా, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు పావనిలు పర్యవేక్షించారు. ఈ వ్యాసరచన పోటీలలో 65 మంది కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వ్యాసరచన పోటీలలో సాయి పవన్ జ్యోతి (బీఎస్సీ జువాలజీ) ప్రథమ విజేతగా, లావణ్య (కంప్యూటర్ సైన్స్) ద్వితీయ విజేతగా, భానుమతి (బిఎస్సి) తృతీయ విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి, కళాశాల అధ్యాపకుల సమక్షంలో ఎస్ఐలు వెంకటేశ్వరరావు, వెంకటరమణల చేతుల మీదుగా బహుమతులు అందజేసారు. అదే విధంగా ఈ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెడల్స్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాస పాత్రుడు, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ వి రమణ, రవీంద్ర నాయక్, జగదీష్ బాబు, ఎన్ఎస్-ఎస్ కార్యక్రమ అధికారులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీడిపిక్కల కొనుగోలుకు దళారులను ఆశ్రయించొద్దు

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలోను జీడిపిక్కల రైతులు దళారుల దగ్గర మోసపోకుండా ఎక్కడికక్కడ జీడిపిక్కలు కొనుగోలు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం సాయంకాలం స్థానిక ఐటిడిఏ సమావేశ హాలులో ఏడు మండలాలకు సంబంధించిన జీడిపిక్కల రైతులతో, జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులతో, ఎన్జీవోలతో జీడిపిక్కల రైతులు దళారుల దగ్గర మోసపోకుండా ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ లోను జీడిపిక్కల రైతులకు అధిక వడ్డీతో వడ్డీ వ్యాపారస్తులు సంతకాలు పెట్టించుకుని డబ్బులు ఇచ్చి వేధించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. జీడిపిక్కల రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. 2001, 2022 సంవత్సరములో వీడీవీకేల ద్వారా 70 మెట్రిక్ టన్నుల జీడిపిక్కలు కొనుగోలు చేయడం జరిగిందని అదేవిధంగా ఈ సంవత్సరం 100 మెట్రిక్ టన్నుల జీడిపిక్కలు కొనే లక్ష్యం పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి జీడి మామిడి పిక్కల రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా అదేవిధంగా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టిన జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏపీవో జనరల్ డిఎన్వి రమణ, విహెచ్ఓ కె.చిట్టిబాబు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ పి.శ్రీనివాస్, విడిఓలు యం.నాగేశ్వరరావు, ఎ.నాగేశ్వ రరావు, ఉద్యానవన శాఖ సబ్ అసిస్టెంట్లు నూకరాజు, నాగరాజు, అబ్బాయి రెడ్డి, శోభన్ బాబు, జీడి మామిడి తోటలు రైతులు, జీడి పిక్కల ప్రాసెస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: ఏలకవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో విద్యార్థులను దండించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక ఏకలవ్య పాఠశాల ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. బాధిత విద్యార్థి తండ్రి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులపై దాడి చేసిన అకౌంటెంట్, ముగ్గురు ఉపాధ్యాయులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంఘటన ఫిబ్రవరి 11న జరిగితే అధికారులు విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారు తప్పా కనీసం చర్యలు తీసుకోలేదన్నారు. తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారని తెలుసుకున్న స్థానిక ఎస్సైలు వెంకటేశ్వరరావు, వెంకట రమణలు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ ఘటనపై ఉన్నతా ధికారులు విచారణ చేపడుతున్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ మనోజ్ కుమార్, అమరావతి నెస్ట్, గురుకులం "అదికా రులతో ఫోన్లో మాట్లాడారు. రెండు రోజుల్లో బాధ్యులైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

## వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనిదినాలు పెంచాలి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేసారు. ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న కూలీలకు అదనంగా పని దినాలు పెంచాలని, రోజు కూలీ రూ.600 రూపాయిలు పెంచాలని, మేట్లకు 5రూపాయిలు పారితోషికం ఇవ్వాలని, 3 సెంట్లు ఇళ్ల స్థలం, ఇళ్లు నిర్మాణానికి 6 లక్షల రూపాయలు ఇవ్వాలని, ప్రతి దళిత కాలనీకి 2 ఎకరాల స్మశాన స్థలం డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై మార్చి 12న విజయవాడలో మహా ధర్నా ఉందని, వ్యవసాయ కార్మికులందరూ మార్చి 11న బయలు దేరి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బి.మోహనరావు, గిరిజన సంఘం నాయకులు కె.సీతారాం పాల్గొన్నారు.

## మ్యుటేషన్ల పరిష్కారంలో జాప్యం తగదు

విశాలాంధ్ర - బెలగాం: రెవెన్యూ సదస్సులో, గ్రామసభల్లో వచ్చిన మ్యూటేషన్ల పరిష్కారంలో జాప్యం తగదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. తాళ్లబురిడి గ్రామంలో ఎఫ్‌పీఓఎల్ఆర్ (ఫేజ్ -2)ని సోమవారం సందర్శించారు. భూ సవరణలకు సంబంధించి మ్యుటేషన్ కొరకు పెట్టుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందికి ఆయన ఆదేశించారు. గ్రామంలో ప్రైవేటు భూములతోపాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరుల భూములు, పోరంబోకు భూములను కొలతలు వేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా రైతులకు భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందని ఆయన అన్నారు. రీ సర్వేలో తప్పులు దొర్లకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. మృతి చెందిన రైతుల మ్యూటేషన్లు, న్యాయపరంగా ఎటువంటి సమస్యలు లేని భూములకు చెందిన మ్యూటేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్య క్రమంలో తహశీల్దార్ వై.జయలక్ష్మి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ట్రైబల్ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - కొయ్యూరు: కొయ్యూరు ఏపీ ట్రైబల్ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టీవీఎం. మోహన్, వైస్ ప్రిన్సిపాల్ కే.శివాజీ తెలిపారు. 2025-26 సంవత్స రాలకు గాను కొయ్యూరు పాఠశాలలో 5వ తరగతిలో చేరడానికి, 6,7,8,9 తరగతులలో ఖాళీలను భర్తీకి వీలుగా ప్రవేశానికి చేపట్టనున్న పోటీ పరీక్షలకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. 5వ తరగతి -80 సీట్లు, 6వ తరగతి -15, 7వ తరగతి-00, 8వ తరగతి -03, 9వ తరగతి -02 సీట్ల భర్తీకి దరఖా స్తులకు ఆహ్వానిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు twreiset. apcfss.in వెబ్సైటులో చూడగలరని అన్నారు. 25-02-2025 తేదీ నుంచి 25-03-2025 తేదీలలో దరఖాస్తులను ఆన్లైన్లో సమర్పించాలని, మరిన్ని వివరాలకోసం పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించగలరని ప్రకటించారు.

## రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాల్సిందేనని చినమేరంగి సర్కిల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పత్రిక కాసులు అన్నారు. మంగళవారం ఆయన చింతల బెలగాం ప్రధాన రహదారి కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహించిన ఆయన నిబంధనలు పాటించని వారి వద్ద నుండి అపరాధ రుసుం వసూలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అదేవిధంగా కార్లలో వెళ్లే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని ఆటోలో వెళ్లేవారు అధిక లోడ్ లో ప్రయాణిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చినమేరంగి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - బెలగాం : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన నాగళ్ల సింహాచలం (56) కొమరాడ మండలం కల్లికోట గ్రామానికి చెందిన గౌరి శంకర్రావు వద్ద గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. సింహాచలం కుమారుడు విశాఖపట్నంలో పని చేస్తున్నాడు. కుమారునికి ఎన్నిమార్లు ఫోన్ చేసినా రాకపోవడంతో మన స్తాపం చెంది చనిపోవాలని సోమవారం గుమడ గ్రామం సమీపంలో ఉన్న ఇటిక బట్టీల వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యానికి పాల్ప డ్డాడు. గమనించిన గౌరి శంకర్రావు వెంటనే మోటార్ సైకిల్ పై పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకుని రాగా వైద్యులు చికిత్స అందించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. గరుగుబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

## 6న ఆశా వర్కర్ల ధర్నా

విశాలాంధ్ర - బలిజిపేట: ఈనెల 6వ తేదీన ఆశా వర్కర్ల రాష్ట్ర వ్యాప్త ధర్నా నిర్వహిస్తున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మలమన్మధరావు, ఆశ వర్కర్ యూనియన్ జిల్లా నాయకులు వి.లక్ష్మి తెలిపారు. ఈ మేరకు బలిజిపేట, అరసాడ, గళావిల్లి, పి.హెచ్.సి వైద్య అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశా వర్కర్స్‌గా మార్పు చేయాలని, ప్రభుత్వ సెలవులు, క్యాజువల్ లీవ్స్, వేతనంతో కూడిన మెటర్నటి లీవ్, రికార్డ్స్, వయోపరిమితి 62కు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులు తదితర ఒప్పంద జీవోల కై 2025 మార్చి 6న విజయవాడలో జరిగే రాష్ట్ర ధర్నా కార్యక్రమంలో ఆశా వర్కర్స్ అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బలిజిపేట, అరసాడ, గలవల్లి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## దేశంలోనే ఉత్తమ అవార్డు పొందిన లైన్‌మెన్ గణేష్

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు లైన్ ఇన్‌స్పెక్టర్ కె.గణేష్ దేశంలోనే విద్యుత్ సేవలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఉత్తమ అవార్డు పొందారు. ఏపిఇపిడిసిఎల్ పరిధిలో ప్రతి ఏటా ఢిల్లీలో మార్చి నాలుగో తేదీన లైన్‌మ్యాన్ దివాస్ పేరిట అత్యుత్తమ పనితీరు కనబరిచిన లైన్‌మ్యాన్లు, ఉద్యోగులను ప్రభుత్వం సత్కరిస్తోంది. ఈ క్రమంలో భాగంగా విశాఖ సర్కిల్ నుండి చింతూరుకు చెందిన లైన్ ఇన్స్పెక్టర్ గణేష్‌కు చింతూరు మండలంలో వరదల సమయంలో అయన చేసిన అత్యుత్తమ సేవలు, 22 సంవత్సరాల తన సర్వీసులో చేసిన ఉత్తమ సేవకు గుర్తింపుగా ప్రభుత్వం ఉత్తమ సేవకులుగా గుర్తించి లైన్ మాన్ దివాస్ అవార్డుతో పాటు హై ఫర్ఫామింగ్ అవార్డు ఇచ్చి సత్కరించింది. అవార్డు పొందిన గణేష్‌ను ఉన్నత విద్యుత్ అధికారులు చింతూరు సబ్‌స్టేషన్ ఎడి, ఎఇ, సబ్ ఇంజినీర్, ఇతర అధికారులు విద్యుత్ ఉద్యోగులు చింతూరు ప్రజలు అభినందించారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - చింతపల్లి: పంచాయతీ పరిధిలో నిబంధనలు అతిక్రమించి ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఎవరు వ్యవహరించినా పంచాయతీ పరంగా కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని సర్పంచ్ దురియా పుష్పలత, ఉప సర్పంచ్ షేక్ నూరుబాబులు అన్నారు. గ్రామంలోని రామాలయ వీధిలో పంచాయతీకి తెలియపరచకుండా రహదారిపైనే బోరు నిర్మాణం చేపడుతున్న విషయాన్ని తెలుసుకున్న వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బోరు నిర్మాణాన్ని ఆపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో బోర్లు నిర్మాణం చేపట్టే ముందు పంచాయతీ అనుమతి పొందాలనే నిబంధన ఉన్నప్పటికీ కొంతమంది ఆ నిబంధనను పాటించకుండా తమ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, ఇదే క్రమంలో మొన్న (ఆదివారం) రామాలయం వీధిలో రహదారి పైనేబోరు నిర్మాణం చేస్తున్నారని తమ దృష్టికి రావడంతో దానిని ఆపడం జరిగిందన్నారు. ఇటువంటి వాటి వలన గ్రామంలో మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కొంతమంది వ్యక్తులు పంచాయతీకి తెలియపరచకుండా అనేక కార్యక్రమాలు చేస్తున్నారని, వాటి వలన ఇతరులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇకమీదట అటువంటి వాటిపై పంచాయతీ పాలక వర్గం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజలు నిబంధనలు పాటించకుండా వ్యవహరించడం వల్లనే మండల కేంద్రములో ఎన్ని నీటి పథకాలు తీసుకువచ్చినా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలకు ప్రజల సహకారం కూడా అవసరమని ఈ సందర్భంగా వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పదవ తరగతి విద్యార్థులకు స్టేషనరీ వితరణ

విశాలాంధ్ర - కొయ్యూరు: కొయ్యూరు మండలం డౌనూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వైయస్ఆర్ టియస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తెడబరికి సురేష్ కుమార్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే స్టేషనరీ అందజేశారు. విద్యార్థులు అందరూ పదవతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు అందిపుచ్చుకొని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. జడ్పీటీసీ వారా నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులు మనస్సు ప్రశాంతంగా వుంచుకొని ప్రతీ సబ్జెక్టుపై దృష్టి కేంద్రీకరించి పరీక్షలు రాసి మంచి మార్కులతో విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు ప్రభుదాస్, వార్డెన్ హరిదేవ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరీక్షలంటే భయం వద్దు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: మండలంలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ హై స్కూల్‌లో చదువుతున్న పదవతరగతి విద్యార్థులకు ఎస్‌జె మెమోరియల్ సొసైటీ వారు అవగాహన కల్పించారు. పరీక్షలంటే భయం వద్దని,ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాసి ముందుకెళితేనే జీవితం బాగుంటుందని కోటేశ్వరరావు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, ఫైల్స్ అందజేశారు. సుమారు 250 మంది విద్యార్థులకు పెన్నులు, ఫైల్స్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ క్యాండిల్ ర్యాలీ

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ప్రారంభమైన ర్యాలీ ఐటీడీఏ కార్యాలయం వరకు కొనసాగింది. ఈర్యాలీలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి డా. టి. కనకదుర్గ, సీడీపీఓలు, సూపర్వైజర్లు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ : 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
బుధవారం 5, మార్చి 2025

# డాక్టరు రాధాకాంత్ సేవలు అభినందనీయం

### జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగన్మోహనరావు, డాక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని పెదంకలాం మెడికల్ ఆఫీసర్ గా డాక్టర్ రాధాకాంత్ అందజేసిన వైద్యసేవలు అభినందనీయమని పార్వతీపురంమన్యం జిల్లావైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ తెర్లి జగన్మోహనరావు, డాక్టర్ మంతిని వినోద్ కుమార్లు కొనియాడారు. మంగళవారంనాడు ఉన్నత వైద్యవిద్యను అభ్యసించేందుకు వెళుతున్న డాక్టర్ రాధాకాంత్ కు పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన సన్మానకార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. రెండేళ్లు కొమరాడ మండలంలోని మాదలింగి పిహెచ్సిలోను, అనంతరం నాలుగున్నరేళ్లు పెదంకలంలో వైద్య సేవలందించిన ఆమెకు ఇటీవల నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ కౌన్సెలింగులో గైనకాలజీ ఉన్నతవిద్య కోర్సుకు ఎంపికయ్యారన్నారు. ఆమె అమలాపురం వైద్యకళాశాలలో వైద్య విద్యను అభ్యసించేందుకు వెళుతున్న నేపథ్యంలో ఆమెను జిల్లా అధికారులు, వైద్యులు, గ్రామ సర్పంచ్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలుఅందజేసి మెమెంటోలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిపరంగా ఇటు పిహెచ్సీలోను, అటుక్షేత్రస్థాయిలో సిబ్బందికి తగు మార్గనిర్దేశనం చేస్తూ మంచి సేవలు అందించారన్నారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ వైద్యాధికారి అవార్డును కూడా సొంతం చేసుకున్నారని తెలిపారు. నాణ్యతా ప్రమాణాల అమలు తీరులో కూడా పిహెచ్సీ ఎంపికై ధృవీకరించబడిందన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, జిల్లా నోడల్ అధికారులు జారీ చేసే ఆదేశాలు, సూచనలు మేరకు ఎల్లప్పుడూ పనిచేసేవారని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో చేసినకృషిని అంతా కొనియాడారు. ఈకార్యక్రమంలో సన్మాన గ్రహీత, ఉన్నత విద్య చదవడానికి వెళ్తున్న డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ ఇక్కడ ప్రజలందరు, నాయకులు, జిల్లా అధికారుల సహాయ సహకారాలతో పాటుసిబ్బంది సహకారంతో సేవలు అందించేందుకు తనవంతు నిరంతరం కృషిచేశానన్నారు. సిబ్బంది సహకారం మరువలేనిది అన్నారు. రోగులకు సేవలు అందజేయడంలో తీసుకున్న శ్రద్ధతోపాటు, నిడగల్లుగ్రామంలో వైద్యసేవలు అందజేయడంలోకూడా ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించాక కూడా గ్రామీణ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. మెడికల్ ఆఫీసరుగా ఎవరినైనా ఇబ్బంది పెట్టి ఉంటే దానిని మనసులో పెట్టుకోవద్దని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, ఎపిడిమియాలజిస్ట్ డాక్టరుశ్రీధర్, వైద్యాధి కారులు ఉషారాణి, పావని, రమ్య, శిరీష, ఈఓలు సూర్య నారాయణ, రమణ వైద్య సిబ్బంది వరలక్ష్మి, గోపాల రావు, రూపావతి, శంకరరావు, అనిల్ కుమార్, ప్రసన్న కుమారి, గిరిబాబు, జయశ్రీ, శశికుమారి సీతానగరం ఆసుపత్రి సీనియర్ అసిస్టెంట్ మురళి, గ్రామపెద్దలు, సచివాలయ వైద్యసిబ్బంది, పిహెచ్‌సి సిబ్బంది, ఆశాకార్యకర్తలు, రాధాకాంత్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా పెదఅంకలం మెడికల్ ఆఫీసర్ గా డాక్టర్ రాధాకాంత్ ఉన్నత విద్యలో జాయిన్ కావడానికి ఒకటి రెండురోజుల్లో రిలీవ్ కానున్నారని, ఆమెస్థానంలో డిడిఓ బాధ్యతలు సీతానగరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారానికి ఇస్తూ జిల్లావైద్యఆరోగ్య శాఖాధికారి ఆదేశాలు జారీచేశారు. రాధా కాంత్ రిలీవ్ కాకముందే మెడికల్ ఆఫీసర్ సీటులో ఇటీవల డిప్యూటేషన్ పై వచ్చిన డాక్టరు రమ్య ఆమెసీటులో మంగళవారంనాడు కూర్చోవడం అందరిని ఆశ్చర్యపరిచింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధాకాంత్ కూడా దీన్నిచూసి ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇంకా ఒకటి, రెండురోజుల తరువాత తాను రిలీవ్ కానున్ననేపథ్యంలో ఇటువంటి సంఘటన జరగడంవల్ల కొద్దిగా ఇబ్బంది వద్దారు. దీంతో ఎక్కువసమయం ఆరుబయట గడవడం గమనార్హం. విలేకరులుకూడా ఈఘటనచూసి ఆశ్చర్యపోయారు. ఇలాంటి సంఘటనలు జరగకుండాఉంటే అదేపెద్దసత్కారమని సిబ్బంది చర్చించుకోవడం గమనార్హం.

## పోలీసుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - సీతంపేట: మండలం మర్రిపాడు గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని సబ్ ఇన్స్పెక్టర్ అమ్మానరావు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జేమ్స్ ఆసుపత్రి మరియు విజయ ఆసుపత్రి, సీతంపేట ఏరియా ఆసుపత్రి నుండి వైద్యాధికారులు పాల్గొని వైద్య సేవలు, మందులు అందిస్తారని, రోగులు పాల్గొని వైద్య సేవలు పొందాలని తెలిపారు.

## జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులుగా సుధారాణి

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులుగా సుధారాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లాలో మెరుగైన సేవలు అందించాలని ఆమెకు కలెక్టర్ తెలిపారు.

## విద్యుత్ లైన్‌మెన్‌ల సేవలు వెలకట్టలేం

విశాలాంధ్ర - ఎటపాక: విద్యుత్ లైన్‌మెన్‌ల సేవలు వెలకట్టలేమని విద్యుత్తు శాఖ డివిజనల్ ఇంజినీర్ గాబ్రెల్ పేర్కొన్నారు. ప్రపంచ లైన్మెన్ దినోత్సవం సందర్భంగా రంప చోడవరం డివిజనల్ ఢీఈ కార్యాలయంలో లైన్మెన్లనూ ఆయనా సత్కరించారు. ఈ సంధర్భంగా అయన మాట్లడుతూ విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌లు పునాదివంటివారన్నారు. జాతీయ లైన్ మెన్‌ల దినోత్సవం రోజున వారిని సముచితంగా గౌరవించడం మంచి సంప్రదాయమన్నారు. విద్యుత్‌శాఖలో ఉత్తమ సేవలందించిన లైన్‌మెన్‌లను, నెల్లీపాక కు చెందినా లైనమేన్ దేవేందర్ నాయక్ ను విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - పాచిపెంట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దినోత్సవాన్ని పురస్కరించుకొని పాచిపెంట ఐసిడిఎస్ పిఓ బి.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు యోగ మెడిటేషన్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అన్నారు. మహిళలు ఆరోగ్యవంతంగా సంతోషంగా ఉండటానికి అవగాహన కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. మహిళల ఆరోగ్యం వంతంగా ఉన్నప్పుడే కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని అన్నారు. మహిళల ఆరోగ్యంగా ఉండటానికి యోగ కార్యక్రమం తో పాటు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించినట్లు సిడిపిఓ అనంతలక్ష్మి తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగ మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు తోటి మహిళలకు వివరించి మహిళల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశా సీహెచ్‌డబ్ల్యుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - చింతపల్లి: ఈనెల 6న సమస్యల పరిష్కారానికై చలో విజయవాడకి తరలిరావాలని ఆశ, సిహెచ్ డబ్ల్యు ల జిల్లా యూనియన్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో జీకే వీధి మండలం. ఆర్ వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాడేరు మండలం మినుములూరు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మ, దాసమ్మ పిలుపునిచ్చారు. పెరిగిన ధరలతో ఇచ్చే వేతనాలు చాలక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గ్రాడ్యుటి. ప్రసూతి సెలవు. 62 సంవత్సరాలు పెంపు తప్ప అమలవుతుందో లేదో వేచి చూడవలసిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచవలసిన అవసరం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప తమ బతుకులు మారలేదని ఇంకా అదనపు భారంగా పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కనీస వేతనం 26,000 గ్యారెంటీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 700 మంది సిహెచ్ డబ్ల్యూ లను ఆశా వర్కర్లుగా మార్చాలని ఆశాలతో పాటు సమాన జీతాలు ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు. ఈ సమస్యల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అడిగేందుకు ఆశ సి హెచ్ డబ్ల్యూ లు అధిక సంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

## క్షతగాత్రులను పరామర్శించిన బీజేపీ నేతలు

విశాలాంధ్ర - జీకే వీధి: గూడెం కొత్తవిధి మండలం దేవరపల్లి పంచాయతీ సాగులు ఘాట్ రోడ్లో జీప్ బోల్తా పడి ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలు అయ్యాయి. ఆ ప్రమాద సంఘటనపై కూటమి నాయకులు మండల బిజెపి అధ్యక్షులు కాకూరి శేఖర్, దేవరపల్లి వైస్ సర్పంచ్ గుమ్మడి రాజు ఎర్రగడ్డ గ్రామానికి చేరుకొని గాయపడ్డ వారిని కలసి పరామర్శించడం జరిగింది. కొందరు చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొతున్నారు. మరొకరు పాడేరు హాస్పటల్లో చికిత్స పొందుతున్నారని గ్రామస్తులు చెప్పారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య బృందాన్ని కోరారు. అలాగే మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ గ్రామస్తులు, దేవరపల్లి వైస్ సర్పంచ్, గుమ్మడి రాజబాబు, వార్డ్ మెంబర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

## ఇందుకూరులో అంబరాన్నంటిన సంబరాలు

విశాలాంధ్ర - దేవీపట్నం: ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల గెలుపు సందర్భంగా దేవిపట్నం మండలం ఇందుకూరు లో క్లస్టర్ ఇంచార్జి రాష్ట్ర రైతు కార్య నిర్వాహక కార్యదర్శి మాగపు బాబురావు ఆధ్వర్యంలో పేరాబత్తుల రాజశేఖరం గెలుపు సంబరాలు అంబరన్నాంటాయి. భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మండల నాయకులు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి తరపున ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేసిన పేరాబత్తుల రాజశేఖరంకి ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించిన పట్టభద్రుల ఓటర్లను పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎం ఎల్ సి అభ్యర్థిగా పోటీ చేసి 1,24,702 (62.59 %) ఓట్లు సాధించి, 77,421 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖరంకి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ సి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి గోళ్ళ చంటిబాబు, రాష్ట్ర తెలుగు యూవత కార్యదర్శి చవలం శివ రామ కృష్ణ, మాజీ మండల అధ్యక్షులు తైలం గంగాధర రావు, నియోజకవర్గ టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ కేశవరపు చంద్ర కుమార్(పండు), మాజీ ఎంపీటీసీలు చారవు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.